వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


సంగం: సంగమేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవిగా కామాక్షిదేవి


మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు


ఆత్మకూరు శివాలయంలో విశేషాలంకారంలో అన్నపూర్ణాదేవి


ఆత్మకూరులోని కాశీనాయన ఆశ్రమంలో రాజరాజేశ్వరీదేవిగా దుర్గాదేవి


కలిగిరి: బాలాత్రిపురసుందరీదేవిగా భద్రకాళి అమ్మవారు

- తొలిరోజు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చిన జగ్జననీ

ఆత్మకూరురూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారాల్లో భక్తులను అనుగ్రహించారు. పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా కోడూరు నారాయణరెడ్డి, కౌసల్యమ్మ దంపతులు వ్యవహరించారు. అలాగే కాశీనాయన ఆశ్రమంలో దుర్గాదేవిని రాజరాజేశ్వరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉత్తరబలిజ వీధిలోని జ్వాలాముఖి అమ్మవారు స్వర్ణకవచలాంకృత జ్వాలాముఖిగా పూజలు అందుకున్నారు. ఉభయకర్తలుగా బైసాని మధుసూదన్‌రావు, ఉషారాణి, బైసాని శ్రీనివాసులు, ద్వారకా, సాయి సుకుమార్, జ్వాలాపవన్, తేజలాస్య, తదితరులు వ్యవహరించారు.

బాలాత్రిపురసుందరీగా కామాక్షిదేవి

సోమశిల: సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారు భ్రమరాంబికదేవిగా దర్శనమివ్వనున్నారు. కామిరెడ్డిపాడులోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు కృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

సంగం : స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షితాయి అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులను అనుగ్రహించారు. గంగమ్మ ఆలయంలో కలశ స్థాపన చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెన్నానది నుంచి కలశాల్లో జలాలను తీసుకుని ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని కలశ స్థాపన చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని సంతానలక్ష్మి, పార్వతీపరమేశ్వర ఆలయాలతో పాటు బాలాజీనగర్‌లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులను కటాక్షించారు.

శైలాపుత్రిగా మానసాదేవి

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో శైలపుత్రి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంటపాడులోని నాగర్పమ్మ ఆలయంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు భక్తులను కటాక్షించింది.

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ పంచాయతీ పరిధిలోని గుదేవారిపాళెంలో ఉన్న రేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. దుత్తలూరులోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.దుత్తలూరు గ్రామం, బీసీ కాలనీలో ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కాగా రాచవారిపల్లిలోని కోదండరామ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

సిద్ధేశ్వరీదేవిగా ఇష్టకామేశ్వరీదేవి

సీతారామపురం : మండలంలోని సిద్ధేశ్వరం క్షేత్రంలో ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు వెండికవచ సిద్ధేశ్వరీదేవిగా దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అయ్యప్పస్వామి మందిరంలో గణపతిపూజ జరిపి అమ్మవారికి హోమం నిర్వహించారు. మంగళవారం అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమివ్వనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కే మాలకొండారెడ్డి, సభ్యుడు సీహెచ్ వసంతరావు తెలిపారు.


సోమశిలలోబాలాత్రిపురసుందరీగా కామాక్షిదేవి

కలిగిరి: మండలంలోని తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో పుణ్యాహవచనం, గణపతిపూజ, అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బాలత్రిపురసుందరీదేవిగా అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.


అల్లూరులోని పోలేరమ్మ చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మర్రిపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యారు. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి కుంకుమార్చన నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిఅలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

పోలేరమ్మకు విశేష పూజలు

అల్లూరు: స్థానిక పోలేరమ్మ చెట్టును పూలు, విద్యుద్దీపాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.


సంగంలో బాలాత్రిపురసుందరీదేవిగా గంగమ్మ


ఆత్మకూరులో విశేషాలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు


సీతారామపురం: ఘటికసిద్ధేశ్వరంలో సిద్ధేశ్వరిగా ఇష్టకామేశ్వరి అమ్మవారు


దుత్తలూరు: బాలాత్రిపురసుందరీగా రేణుకఎల్లమ్మ


ఉదయగిరిలో బాలాత్రిపురసుందరీగా పార్వతీదేవి


వరికుంటపాడు: శైలాపుత్రిగా మానసాదేవి

క్లుప్తంగా

28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వింజమూరు(ఉదయగిరి): ఈ నెల 28న వింజమూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

యూరియా పంపిణీ

సీతారామపురం : అయ్యావారిపల్లి రైతుసేవా కేంద్రంలో రైతులకు యూరియాను మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ సోమవారం పంపిణీ చేశారు. రైతుసేవా కేంద్రానికి 18 మెట్రిక్ టన్నుల యూరియా రాగా 200 మంది రైతులకు పంపిణీ చేశామని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. త్వరలో మారంరెడ్డిపల్లి సొసైటీలో కూడా అందుబాటులో ఉంచుతామన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



మర్రిపాడు: మండలంలోని ధనలక్ష్మి సీడ్స్, వెంకటేశ్వర ఫెస్టిసైడ్స్‌లో విజిలెన్స్ ఏఓ వి వేణుగోపాల్‌రావు, ఎస్‌ఐ షేక్ సుభానీ సోమవారం తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. వాటికి సంబంధించి ఎరువుల స్టాక్ రిజిస్టర్లను నిర్వహించకపోవడంతో విక్రయాలను నిలిపివేయాలని మండల ఏఓ ఎన్ కవిత ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు



ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలను సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి, వైస్‌ప్రిన్సిపల్ నరసింహులు ,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విక్రం, వైద్య సిబ్బంది షఫీ,జ్యోతి, పర్వేజ్, సికిందర్ పాల్గొన్నారు.

చెరువులో లారీ బోల్తా



వింజమూరు(ఉదయగిరి): జమ్మలమడుగు నుంచి వింజమూరుకు సిమెంట్‌లోడుతో బయలుదేరిన లారీ సోమవారం పాతూరు చెరువుకట్టపై ఎదురుగా వస్తున్న ట్రావెల్స్‌కు సైడిచ్చే క్రమంలో మార్జిన్‌లోకి వచ్చి అదుపుతప్పి చెరువులో బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా లారీలో నుంచి దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా కొన్ని రోజులుగా హైవే నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ మార్జిన్లపై గ్రావెల్ తోలి ఉంచడంతో ఘటన చోటుచేసుకుందని స్థానికులు చెబుతున్నారు. ఏఎస్సై జయరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పట్టాల మంజూరుకు వినతి

వరికుంటపాడు: వేంపాడు పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 70/1లోని 2.70 ఎకరాల భూమిని 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, తమకు డీ-ఫారం పట్టాలు మంజూరు చేయాలని ఎస్సీ కాలనీకి చెందిన తాతపూడి వేళాంగిణి, ఓబులాపురం సుమతి కోరారు. ఈ మేరకు వరికుంటపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ హేమంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

పోషకాహారంపై అవగాహన

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లె గ్రామ సచివాలయంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సీతారామపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్నరెడ్డి పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గాజులపల్లి భారతిరెడ్డి, వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఆందోళన

ఆత్మకూరురూరల్: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మహంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలను ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు సోమవారం సందర్శించారు. ఆదివారం నుంచి ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించినా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తుండడంపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సెలవులు ప్రకటించినా ప్రైవేట్ విద్యాసంస్థలు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు వారికి దాసోహమై పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ఆత్మకూరు ఎంఈఓకు ఫోన్ ద్వారా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల వివరాలను తెలియజేసి మూసివేయించారు. విద్యార్థి సంఘం నాయకులు వినయ్, పూర్ణేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని గిరిజనుల ధర్నా


గిరిజనులతో చర్చలు జరుపుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరురూరల్: మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు అనంతరాయనియేని గిరిజనకాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట గిరిజనులు సోమవారం ధర్నా చేపట్టారు. ఆత్మకూరు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు నందా ఓబులేసు ఆధ్వర్యంలో గిరిజనులు ప్రదర్శనగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని బైఠాయించి నినాదాలతో హోరెత్తించారు. 80 కుటుంబాలు కలిగిన తమ కాలనీ రోడ్డు అధ్వానంగా ఉందని, వర్షం కురిస్తే కనీసం కాలినడకన కూడా వెళ్లలేకున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా తమ కాలనీలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. గతంలో కాలనీకి నుడా నిధులు రూ.15 లక్షలు మంజూరైనట్లు అధికారికంగా చెప్పిన మున్సిపల్ అధికారులు నయాపైసా పనులు చేపట్టలేదన్నారు. వర్షం కురిస్తే ఉపాధ్యాయులు రాక కాలనీలోని పాఠశాలలు కూడా మూతపడుతున్నాయన్నారు. అంగన్‌వాడీ సరుకులు కూడా అతికష్టం మీద చేర్చుకోవాల్సి వస్తుందన్నారు. సుమారు రెండు గంటల పాటు గిరిజనులు ధర్నా చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారపు వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, వైస్‌చైర్మన్ సర్దార్, టీడీపీ నాయకులు బాధితులతో చర్చలు జరిపినా వారు శాంతించలేదు. చివరకు ఆత్మకూరు సీఐ గంగాధర్ అధికారులు, బాధితులతో మాట్లాడి సమన్వయం చేశారు. రెండ్రోజుల్లోగా జేసీబీతో రోడ్డును చదును చేయించి తాత్కాలిక మరమ్మతులు చేపడతామని, ఎస్సీ గిరిజన సబ్‌ప్లాన్ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వారు తాత్కాలికంగా ఆందోళనను విరమించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆత్మకూరు వెంకటేశ్వర్లు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి


ఆత్మకూరులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరురూరల్: మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ షేక్ అస్మా అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు పోషకాహారం, గర్భాశయ, నోటి, రొమ్ము కేన్సర్లపై అవగాహన కల్పించారు. అనంతరం 162 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, 9వ వార్డు కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, యునాని వైద్యాధికారి అబ్దుల్‌రజాక్, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, పార్వతి, అంగన్‌వాడీల నాయకురాలు రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని కృష్ణంపల్లిలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి వినీ మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ


యాప్‌పై శిక్షణ ఇస్తున్న ఏపీఎం శ్రీనివాసులు

సీతారామపురం : స్థానిక డీఆర్డీఏ వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మన డబ్బులు-మన లెక్కలు యాప్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు యాప్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ గ్రూపులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల వివరాలను యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలకు తావులేకుండా పారదర్శకత కోసం యాప్‌ను రూపొందించారన్నారు. అనంతరం యాప్ ఆవశ్యకతపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. వెలుగు సీసీలు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.345

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.345 పలికింది. వేలానికి 1150 బేళ్లు రాగా, 979 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.345, కనిష్ఠంగా రూ.90, సగటున రూ.217.73 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 345 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 951 బేళ్లను తీసుకురాగా, 848 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.345, కనిష్ఠంగా రూ.90, సరాసరిన రూ.214.81 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం జనార్దనపురం-వెంగనపాళెం మధ్యన ఉన్న మట్టిరోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షం కురిస్తే బురదమయంగా మారుతుండడంతో రాకపోకలకు సాగించేందుకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డును తారురోడ్డుగా మారుస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఏడాదిన్నర గడుస్తున్నా పట్టించుకోకపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ సమావేశం జయప్రదానికి పిలుపు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని శ్రీధర్‌గార్డెన్స్‌లో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో అనే అంశాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆత్మకూరురూరల్: ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని అన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి ఆర్డీఓ పావనతి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని అనంతరాయనియేని గిరిజనకాలనీవాసులు తమ సమస్యలపై ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. శ్మశాన సమస్యపై ఆర్డీఓ స్పందిస్తూ రెండ్రోజుల్లోగా తనకు నివేదిక అందజేయాలని ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారిని ఆదేశించారు. బొగ్గేరు గట్టు సమీపాన తమకు శ్మశాన స్థలం కేటాయించాలని బాధితులు విజ్ఞప్తి చేయగా క్షేత్ర స్థాయిలో విచారించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. న్యాయవాది నందా ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆత్మకూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగు పరిమితంగా చేపట్టాలి


మర్రిపాడు: అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

కలిగిరి: 2025-26 పంటకాలానికి పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పంట సాగుచేపట్టాలని కలిగిరి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి శివకుమార్ రైతులకు సూచించారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయంగా పొగాకు సాగు చేసే బ్రెజిల్, చైనా, జింబాబ్వే దేశాల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పొగాకు దిగుబడులు అధికంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పొగాకు ధరల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. అందువల్ల రైతులు అధిక కౌలుకు బ్యారెన్లు, పొలాలు లీజుకు తీసుకుని పొగాకు సాగు చేపట్టవద్దని సూచించారు. పొగాకుబోర్డు అనుమతించిన దాని కన్నా అధిక విస్తీర్ణంలో పొగాకు చేపడితే నష్టపోవాల్సి వస్తుందన్నారు. అనంతరం పొగాకు సాగులో రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఐటీసీ కంపెనీ ప్రతినిధి గోలి వెంకటేష్, ఫీల్డ్‌ఆఫీసర్ సంతోష్ పాల్గొన్నారు.

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ మాట్లాడుతూ 2025-26పంట కాలానికి పొగాకు బోర్డు బ్యారెన్‌కు 2.90హెక్టార్లలో 3665 కిలోలు పండించడానికి అనుమతిని ఇచ్చిందని తెలిపారు. ఆ మేరకు మాత్రమే రైతులు సాగుచేపట్టాలని సూచించారు. అంతకంటే ఎక్కువగా సాగుచేపడితే నష్టపోవాల్సి వస్తుందన్నారు. పొగాకు నారుమడులు పోసి విక్రయించే రైతులు తప్పకుండా బోర్డు అనుమతి తీసుకోవాలని, బ్యారెన్ లైసెన్స్ ఉన్న రైతులకు మాత్రమే నారు విక్రయించాలని సూచించారు. ఐటీసీ మేనేజర్ విజయ్, జీపీఐ మేనేజర్ హ్యూమయూన్, పొగాకు బోర్డు ఫీల్డ్‌ఆఫీసర్ ఆదర్శ్ జగన్నాథన్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణ అడ్డగింత



మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ భూమిని సోమవారం కొందరు ఆక్రమించేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అల్లంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1083లో 10 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై కన్నేసిన కొందరు జేసీబీ సాయంతో చెట్లను తొలగిస్తుండగా సమాచారం అందుకున్న ఆర్‌ఐ సాయికిరణ్, సర్వేయర్లు ఘటనా స్థలానికి చేరుకుని ఆక్రమణలను నిలుపుదల చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణ తగదు

కావలి(అల్లూరు): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి అన్నారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.8 కోట్లతో 17 వైద్యకళాశాలలను ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి కోట్లాది రూపాయలకు సీట్లు అమ్ముకోవడం ద్వారా బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అన్యాయం చేయాలని చూడం దుర్మార్గమన్నారు. దళిత నాయకులు బాపట్ల సత్యవతమ్మ, జరుగుమల్లి విజయరత్నం, చౌటూరు లక్ష్మయ్య, జెడ్డా వాసు, మోహన్ రావ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.